



ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న బాలికలు

● ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల



ఆశ్రమ పాఠశాలలు.. అగమ్యగోచరం!

- గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు సకాలంలో విడుదల కాని నిధులు
- మున్ముందు ఉంటాయా? లేదా? అనే పరిస్థితిలో పాఠశాలలు
- నిధులు విడుదలకాక తిప్పలు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి ఇదే తీరు
- పరిస్థితి ఇలాగే కొనసాగితే.. వచ్చే విద్యా సంవత్సరంపై తీవ్ర ప్రభావం
- ఇలాగైతే ఎలా? అంటున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, సిబ్బంది
- అప్పుల్లో కూరుకుపోతున్న ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు
- వేతనాలు రాక సీఆర్టీలకూ తప్పని వెతలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 133 ఆశ్రమ పాఠశాలల్లో మొత్తం 32వేల మంది విద్యార్థులు

ఉట్నూర్, ఏప్రిల్ 9: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల కోసం కావాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేయక పోతుండడంతో రానున్న రోజుల్లో ఆశ్రమ పాఠశాలలు ఉంటాయా? లేదా? అనే అగమ్యగోచర పరిస్థితి నెలకొందని అంటున్నారు. గిరిజన విద్యార్థులకు పాఠశాలలోనే చదువుతో పాటు భోజన వసతి సౌకర్యాలు కల్పించి గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలలకు.. ప్రభుత్వం రూ.30 కోట్ల వరకు సకాలంలో నిధులు విడుదల చేయడం లేదని గిరిజనులు అంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సైతం సకాలంలో నిధులు విడుదలకాలేదు. దీంతో ఆ రోజుల్లో కూడా ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర సరుకులు సరఫరా చేయడానికి వ్యాపారులకు, పాఠశాలలకు మధ్యవర్తిత్వం వహించిన గిరిజన సహకార సంస్థ ఆర్థిక ఇబ్బందులకు గురైంది. దీంతో సరుకులు సరఫరా చరేయడానికి ముందుకు వచ్చే వ్యాపారులు సైతం తాము సరుకులు సరఫరా చేయలేమని చేతులెత్తేయడంతో గిరిజన సహకార సంస్థ నిమ్మకుండిపోయింది. రాష్ట్రంలో ఐదు నెలల క్రితం కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాలో సైతం నిధులు విడుదల అవుతాయని భావించారు. అయినప్పటికీ గత సర్కారు హయాంలోనే నిధుల కొరత వచ్చిందని.. ఆ కొరతను తీర్చడానికి సరికొత్త ప్రణాళికలు చేస్తున్నామని ప్రకటించడం గమనార్హం. అయితే, ప్రస్తుత ప్రభుత్వంలోనూ పరిస్థితులు ఇలాగే ఉంటే వచ్చే విద్యా సంవత్సరం నాటికి తాము బాధ్యతలు చేపట్టలేమని ఆయా పాఠశా లల్లో పని చేస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, డిప్యూటీ వార్డెన్లు స్పష్టం చేస్తున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే ఆశ్రమ పాఠశాలలను కొనసాగించడానికి ఇబ్బందులు తప్పవని సంబంధిత అధికారులు సైతం విచారం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదలకాక ఇబ్బందులు

గత రెండేళ్లుగా గిరిజన విద్యార్థులకు చదువుతో పాటు సంక్షేమం కలిగిస్తున్న ఆశ్రమ పాఠశాలలకు సకాలంలో నిధులు విడుదల కాక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, డిప్యూటీ వార్డెన్లు గత సంవత్సరం కాలంగా గిరిజన సహకార సంస్థ ద్వారా సకాలంలో సరుకులు సరఫరా కాకపోతుండడంతో అప్పులు తెచ్చి మరీ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు భోజన వసతులు అందిస్తున్నారు. షావుకారుల దగ్గర వడ్డీలకు అప్పులు చేసి సరుకులు కొనుగోలు చేసిన వారు కొందరైతే, వ్యాపారుల వద్ద అరువుగా సరుకులు తెచ్చి ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులను నిర్వాహకులు కాపాడుతూ వస్తున్నారు. ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని గిరిజన విద్యార్థుల కోసం ఆశ్రమ పాఠశాలలు పని చేస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 54 ఆశ్రమ పాఠశాలలు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 46 ఆశ్రమ పాఠశాలలు, మంచిర్యాల జిల్లాలో 16 ఆశ్రమ పాఠశాలలు, నిర్మల్ జిల్లాలో 17 ఆశ్రమ పాఠశాలలు కలిలుపుకొని 133 పాఠశాలలు బాల, బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 133 ఆశ్రమ పాఠశాలల్లో 32వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న మూడు నుంచి ఏడవ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.850, ఎనిమిది నుంచి పదవ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.1100, మెనూ అమలు కోసం నిధులు కేటాయిస్తుండగా.. ఆదర్శ క్రీడా పాఠశాలలు ఉట్నూర్, జాతర్ల, ఆసిఫాబాద్‌లలో నెలకొల్పిన ఆదర్శ క్రీడా విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు ప్రత్యేక మెనూ అమలు కోసం రూ.1150 కేటాయిస్తున్నారు. ఆయా ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచిత భోజనంతో పాటు నాలుగు జతల దుస్తులు, బెడ్‌షీట్లు, ప్లేట్లు, గ్లాసులు, నోటు పుస్తకాలు, క్రీడా పాఠశాల విద్యార్థులకు బూట్లు, దుస్తులను అందజేస్తున్నారు.

అప్పుల్లో కూరుకుపోతున్న వార్డెన్లు

ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, డిప్యూటీ వార్డెన్లు సకాలంలో నిధులు విడుదల కాక పోతుండడంతో అప్పుల్లో కూరుకుపోతున్నారు. రెగ్యూలర్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు లేని చోట ఆశ్రమ పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులను డిప్యూటీ వార్డెన్లుగా నియమిస్తుండడంతో.. ఆ బాధ్యతలు మోయడం భారంగా ఉందని వార్డెన్లు భావిస్తున్నారు. గిరిజన సహకార సంస్థ ద్వారా కొన్ని సరుకులు సరఫరా చేస్తున్నప్పటికీ.. కూరగాయలు, గ్యాస్, మరికొన్ని సరుకుల కోసం తాము అప్పులు చేయాల్సి వస్తుందని అంటున్నారు. అలాగే సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తే ఇన్ని ఇబ్బందులు రావని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలకు కావాల్సిన నిధులను సత్వరమే విడుదల చేసి గిరిజన విద్యార్థుల సంక్షేమం మరిచి పోవద్దని అంటున్నారు.

వేతనాలు రాక సీఆర్టీల వెతలు

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కొరత ఉన్న ఉపాధ్యాయుల నియామకం కోసం గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐటీడీఏ అధికారులు కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్ (సీఆర్టీ)లను నియమించింది. ఉమ్మడి జిల్లాలోని 133 ఆశ్రమ పాఠశాలల్లో 1150మంది సీఆర్టీలు పని చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ సీఆర్టీకీ ప్రతీనెల రూ.28వేలు, ఎస్‌జీటీ సీఆర్టీకి రూ.22వేలు వేతనం ప్రకటించిన విధంగా.. ప్రతీ నెల ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం సీఆర్టీల వేతనాల బడ్జెట్ విడుదల చేయడంలోనూ కాలయపాన చేస్తుండంతో గత నవంబరు నుంచి సీఆర్టీలకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



నిధులు విడుదల కాకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తుంది

: రాథోడ్ ప్రకాష్, డిప్యూటీ వార్డెన్, ఉట్నూర్



ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల నిర్వహణకు కావాల్సిన నిధులు విడుదల కాకపోతుండడంతో వార్డెన్లు అప్పులు చేయాల్సిన పరిస్థితినెలకొంది. పాఠశాలల విద్యార్థులకు కావాల్సిన బోజనాల కోసం ప్రతినిత్యం కూరగాయలు, ఇతర కిరాన వస్తువులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఒక్కొక్క వార్డెన్‌కు రూ.4లక్షల నుంచి రూ.10లక్షల వరకు రావాల్సి ఉంది. సకాలంలో బిల్లులు రాక పోవడంతో అప్పులు చేసి వార్డెన్లు పాఠశాలలు నడిపస్తున్నారు.

చాలీచాలని వేతనాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు

: ఉయిక రమేష్, సీఆర్టీల సంఘం జిల్లా అధ్యక్షుడు

వెంటాడుతున్న నిరుద్యోగంతో చాలి చాలని వేతనాలతో ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షి టీచర్లకు సకాలంలో వేతనాలు అందించాలి. వేతనాలు సకాలంలో రాక పోవడంతో తమ పిల్లల ఫీజులు సైతం చెల్లించలేక కుటుంబాలను పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నాం. వేతనాలు సకాలంలో అందించడంతో పాటు 1 0 నెలల 30శాతం పీఆర్సీ పెండింగ్ బకాయిలు సైతం అందించి ఆదుకోవాలి.

ప్రభుత్వానికి డైట్ బిల్లులు సమర్పించాం

: దిలీప్‌కుమార్, డీడీ, ఐటీడీఏ ఉట్నూర్



ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన డైట్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వానికి బిల్లులు సమర్పించడం జరిగింది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే ఆయా పాఠశాలల వార్డెన్లకు, సీఆర్టీలకు వేతనాలు సైతం చెల్లించడం జరుగుతుంది. సకాలంలోనే నిధులు విడుదల అవుతాయని భావిస్తున్నాం.

సంక్షిప్త సమాచారం



సంఘం జెండాను ఎగురవేస్తున్న సంఘం నాయకులు

'పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం'

తలమడుగు, ఏప్రిల్ 9: ఉద్యోగులు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం తెలంగాణ పీఆర్టీయూతోనే సాధ్యమని జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్‌యాదవ్ అన్నారు. మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ పీఆర్టీయూ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను ఎగురవేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేపట్టారు. అదేవిధంగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దేశానికి వెన్నెముకలాంటి రైతులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఘం ఏర్పడి 13 ఏళ్లు పూర్తి చేసుకుని 14వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామన్నారు. సంగమ దూరంలో అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్ సింగ్, జిల్లాగౌరవ అధ్యక్షుడు దాసరి బాబన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాష్, జిల్లా కోశాధికారి ముజీబ్, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్‌కుమార్, సిరికొండ మండల అధ్యక్షుడు దినేష్, నేరడిగొండ మండల అధ్యక్షుడు అంబారావు, చంద్రశేఖర్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవిరాజ్, రాష్ట్ర, జిల్లా, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ కౌన్సిలర్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 9: కాంగ్రెస్ పార్టీలో చేరికల పరంపర కొనసాగుతూనే ఉంది. ఆదిలాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం 13వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు పలువురు కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బీజేపీ నూతన మండల కన్వీనర్లు వీరే..

బోథ్/నేరడిగొండ/బజార్‌హత్నూర్, ఏప్రిల్ 9: బోథ్ నియోజకవర్గం పరిధిలోని బోథ్, నేరడిగొండ, బజార్హత్నూర్, గుడిహత్నూర్ మండల పార్టీ కన్వీనర్లను మారుస్తూ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బ్రహ్మానంద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా ఆయా మండలాలకు సంబంధించి కన్వీనర్ల మార్పునకు సంబంధించిన జాబితాను నూతన కన్వీనర్లు అందించారు. బోథ్ మండల కన్వీనర్‌గా సోనాల గ్రామానికి చెందిన బోరే రవీందర్, నేరడిగొండ కన్వీనర్‌గా సాబ్లే సంతోష్‌సింగ్, బజార్హత్నూర్ మండల కన్వీనర్‌గా పోరెడ్డి శ్రీనివాస్, గుడిహత్నూర్ మండల కన్వీనర్‌గా కేంద్రీ శివాజీని నియమిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వెల్లడించారు.

ఘనంగా ఉగాది పర్వదిన వేడుకలు

● జిల్లాలోని ప్రధాన ఆలయాలలో భక్తుల సందడి ● పలుచోట్ల వేద పండితుల పంచాంగ శ్రవణ పఠనం ● ఉగాది పచ్చడి వితరణ



ఆదిలాబాద్‌లో పంచాంగ పఠనం చేస్తున్న చికిలి వెంకటేశ్వర శాస్త్రీ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 9: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పర్వాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లాలోని ఆలయాల్లో భక్తుల సందడినెలకొంది. జిల్లాకేంద్రంలోని కైలాస్‌నగర్ కాలనీలో ఉన్న దక్షిణాముఖ హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ సిద్ధాంతి చికిలి వెంకటేశ్వరశాస్త్రీ సంవత్సరంలో ఏ కార్యం చేసినా భక్తిశ్రద్ధలతో, అంకిత భావంతో పూర్తి చేయాలని సూచించారు. అటు సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉగాదిని ఘనంగా నిర్వహించారు. ఇందులో పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం వద్ద సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు భక్తులకు ఉగాది పచ్చడి అందజేశారు. ఈ సందర్భంగా మఠాధిపతి యోగానంద సరస్వతి క్రోధి నామ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సంవత్సరంలో ప్రతీఒక్కరికి శుభాలు కలగాలన్నారు. ఇందులో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, తదితరులున్నారు.



ఉగాది పచ్చడిని పంపిణీ చేస్తున్న యోగానంద సరస్వతి స్వామి, సభ్యులు

● ఏజెన్సీలో ఉగాది సంబరాలు

ఉట్నూర్: ఉట్నూర్ డివిజన్‌లోని ప్రజలు మంగళవారం ఉగాది పండుగ పురస్కరించుకుని ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. శ్రీక్రోధి నామ సంవత్సరం యేడాది పొడుగునా ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ఆయా మందిరాల్లో పూజలు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మండలకేంద్రంలోని హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో పూజారి దీపక్‌దుబే దుబే ఆధ్వర్యంలో అయ్యప్ప అభిషేక పూజలు నిర్వహించగా.. భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి దీపక్‌దుబే ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సంవత్సరం చిరుధాన్యాల పంటలు సమృద్ధిగాపండుతాయని, అదే విధంగా నల్లని ఎర్రని భూముల్లో సైతం పంటలు పండుతాయని అన్నారు. ప్రతీఒక్కరు కోప తాపాలు వీడి సంతోషంగా ఉండడానికి ప్రయత్నించాలన్నారు. పాత ఉట్నూర్‌లోని సాయిబాబా ఆలయంలో పూజారి సంతోష్‌దుబే ఆధ్వర్యంలో రాజేష్ దంపతులు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఉట్నూర్ మండలంతో పాటు నార్నూర్, గాదిగూడ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఉగాది పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

● వ్యవసాయ పనులను ప్రారంభించిన రైతులు

తలమడుగు/తాంసి: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం పూటనే రైతులు తమ తమ వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి భూమాతకు పూజలు చేసి వేసే పనులను ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో గల ఆలయాల్లో వేద పండితులతో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని చేపట్టారు.అదేవిధంగా బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావు తన వ్యవసాయ పొలంలో అరక దున్ని పనులను ప్రారంభించారు. అదేవిధంగా ఈ సంవత్సరం ఏ పంటలు అధికంగా పండుతాయి. వర్షపాతం ఏవిధంగా ఉంది. తదితరుల విషయాలను పంచాంగ శ్రవణం ద్వారా రైతులు తెలుసుకున్నారు. అదే విధంగా మండలకేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో వేద పండితులు కళ్యాణ్‌కుమార్, పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. అదేవిధంగా బరంపూర్ వేంకటేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్థులు భక్తులు, వేద పండితులను ఘనంగా సన్మానించారు. ఇందులో తలమడుగు ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, బరంపూర్ ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదరేశ్వర్‌రెడ్డి,కమిటీ సభ్యులు బరంకమల్లేష్, పండితులు స్వస్తిక్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, తాంసి మండలంలోని తాంసి, పొన్నారి, కప్పర్ల, జామిడి గ్రామాలలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఎవరికి తోచిన రీతిలో వారు తమ పండగను ఎంతో ఆనందంతో జరుపుకున్నారు. ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నేరడిగొండ: నియోజకవర్గ ప్రజలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నూతన తెలుగు(క్రోధి) నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను తెలిపారు. మండలంలలోని రాజూరా గ్రామంలో ఉగాది పండుగను పురష్కరించుకుని తన వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా తన పొలంలో అరక పట్టారు. గ్రామంలో గల సంత్ సేవాలాల్ జగదాంబ దేవి ఆలయంలో గ్రామస్థులతో కలిసి పూజలు చెశారు. అనంతరం మండల కేంద్రంలో గల శివాలయంలోనూ పూజలు చేశారు. జీవితమంటే ఆరు రుచుల సమ్మేళనం, కాల గమనానికి ఆది ఉగాది.. తెలుగు వారందరికీ నూతన సంవత్సరాది అన్నారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.



ఉట్నూర్‌లోని అయ్యప్ప ఆలయంలో భక్తుల సందడి



రాజూరా గ్రామంలో అరక పట్టిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పొన్నారిలో ఎద్దులకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాపురావు

పౌజ్‌పూర్ వద్ద రూ.లక్ష 96 వేల నగదు పట్టివేత

● వివరాలు వెల్లడించిన ఎఫ్ఎస్‌టీ టీం బృందం



నగదును స్వాధీనం చేసుకున్న ఎఫ్ఎస్‌టీ టీం బృందం

జైనథ్, ఏప్రిల్ 9: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జైనథ్ మండలంలోని పౌజ్‌పూర్ గ్రామ సమీపంలో ఎస్ఎస్‌టీ టీం బృందం అధికారి టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ వాహనాలను తనిఖీ నిర్వహించారు. బేల మండలం నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారున ఎంబర్ ఎంహెచ్29ఆర్6956 తనిఖీ చేయగా అందులో ఉన్న ఒక లక్ష 96,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును ఎలాంటి ఆధారాలు లేక పోవడంతఙకారు యజమాని అయిన కిరణ్‌బడంగే పై కేసు నమోదు చేశారు. పట్టుబడిన ఈ నగదును జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నగదును డిపాజిట్ చేసినట్లు ఎఫ్ఎస్‌టీ టీం లీడర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు ఎ.వెంకటరమణ, సి.గణేస్ వీడియోగ్రాఫర్ చంద్రశేఖర్, డ్రైవర్ జహీర్, తదితరులు ఉన్నారు.

రంజాన్ వేళలు

బుధవారం

ఇఫ్తార్ సా.6.36



మీరు మీ కోసం దేన్ని కోరుకుంటారో.. అదే మీ పొరుగు వారికి ఇవ్వండి. మీరు వారి పట్ల ఇలాంటి ప్రేమను కలిగి ఉంటే.. దైవం పట్ల విశ్వాసం కలిగి ఉన్నవారుగా పరిగణించబడతారు.



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

మహనీయుల బాటలో నడవాలి

● సహాయ ట్రైబల్ అభివృద్ధి అధికారి(ఏడీడీవో) నిహారిక

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 9: మహనీయుల బాటలో నడవడమే ఆ మహనీయులకు మనం ఇచ్చే గొప్పనివాళి అని సహాయ ట్రైబల్ అభివృద్ధి అధికారి నిహారిక అన్నారు. మంగళవారం టీఏవీఎస్, ఏటీజీఎస్, కేవీపీఎస్ సంయుక్తంగా నిర్వహించిన ఏప్రిల్ నెల మాసంను మహనీయుల మాసంగా జరుపుకుందాం, మహనీయులను స్మరించుకుందా అనే కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పూసంసచిన్ అధ్యక్షతన రాంజీగోండ్ 164వ వర్ధంతి, మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి, అంబేద్కర్ 133వ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏటీడీవో నిహారిక మాట్లాడుతూ రాంజీగోండు, మహాత్మాజ్యోతి బాపూలే, అంబేద్కర్ వంటి మహనీయుల బాటలో నేటితరం యువత నడవడమే వారికి మనమిచ్చే ఘననివాళి అని వారి స్ఫూర్తితో చదువులో మరింత రాణించాలని కోరారు. ఇందులో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, టీఏవీఎస్ నాయకులు ఆత్రంకిష్టన్న, మేస్రం మహేశ్, ఆడ అర్జున్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జితేందర్, ప్రవీణ్, టీఏజీఎస్ నేతలు స్వామి, నారాయణ, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజలందరికీ అందుబాటులో ఉండేందుకే క్యాంపు కార్యాలయం'

ఉట్నూర్, ఏప్రిల్ 9: ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల ప్రజలకు అందుబాటులో ఉండడానికి ఉట్నూర్ కేంద్రంగా క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఉగాది పండుగపురస్కరించుకొని ఉట్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసుకున్న క్యాంపు కార్యాలయంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన క్యాంపు కార్యాలయాన్ని ఖానాపూర్‌లో ఏర్పాటు చేయడం వల్ల అటు ప్రాంతంలోని ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్, జన్నారం మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరు తమ సమస్యలను నేరుగా తనకు తెలుపుకోవాలని మధ్యవర్తుల ద్వారా ఎలాంటివి పంపవద్దన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులోఉండి సేవ చేయాలన్న ఆకాంక్షతో తాను రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం చేపడుతున్న ఆరు గ్యారెంటీల అమలు జరుగుతున్న ప్రతిపక్షా పార్టీలు విమర్శిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రంరాహుల్, ఖయ్యూం, లాజర్, నిసార్, అజీముద్దీన్, దూటరాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

కల్లూరు సాయిబాబా ఆలయంలో పంచాంగ శ్రవణం



కుంటాల, ఏప్రిల్, 9 : మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో మంగళవారం ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. వేద పండితులు ప్రకాష్ జోషి ఆధ్వర్యంలో ఈ ఏడాదికి సంబంధించిన పంచాంగాన్ని చదివి వినిపించారు. అంతేగాకుండా వివిధ ఆలయాలలో పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది పండుగ అంటే షడ్రుచుల సమ్మేళనంలో భాగంగా చాలా చోట్ల వేప, మామిడి, చింతతో తయారు చేసిన రసాన్ని, ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఈ పండగ ఎంతో ముఖ్యమైంది కావడంతో ఉదయాన్నే రైతులు తమ పంటల పొలాలకు వెళ్లి నూతన వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

రాంజీగోండు ఆశయ సాధనకు కృషి చేద్దాం

● వర్ధంతి సభలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ● ఘన నివాళులు అర్పించిన మాజీ మంత్రి జోగు రామన్న, ఆదివాసీలు

ఉట్నూర్, ఏప్రిల్ 9: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన రాంజీగోండు ఆశయ సాధన కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలోని రాంజీగోండునగర్‌లో మర్సుకోల రాంజీగోండు 164 వర్ధంతి సభలో పాల్గొన్నారు. ముందుగా రాంజీచౌక్‌ను ప్రారంభించి రాంజి గోండు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాంజీగోండు దేశం కోసం ఈ ప్రాంత ప్రజల కోసం చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్వరతి ఒక్కరు రాంజీగోండు స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను నీటి సమస్యను పరిష్కరించే చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల అనంతరం అర్హులైన పీవీటీజీలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. త్వరలో రాంజీగోండు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, అడిషనల్ డీఎంహెచ్‌వో కుడిమెత మనోహర్, మానవ హక్కులవేదిక రాష్ట్ర నాయకులు భుజంగరావు, రాజ్‌గోండు సేవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు, మరసుకోల తిరుపతి, సలాందేవరావు, బండి విజయ్‌కుమార్, మర్సుకోల సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.



రాంజీగోండునగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

● 'రాంజీగోండు సేవలు మరువలేనివి'

ఆదిలాబాద్ అర్బన్: గిరిజన హక్కుల సాధన కోసం పోరాడిన రాంజీగోండు సేవలు మరువలేనివని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. రాంజీగోండు వర్ధంతిని పురస్కరించుకుని బస్టాండ్ ఎదుట గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అంతకు ముందు ఆదివాసీ సంఘాల నేతలు రాంజీగోండు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజనుల హక్కుల సాధన కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన రాంజీగోండు ఆశయాల సాధణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని అన్నారు. రాంజీగోండు పోరాట స్ఫూర్తితో ప్రతీఒక్కరు ముందుకు సాగాలని, ఆంగ్లేయుల పాలనలో అనేక ఉద్యమాలు చేసిన ఘనత రాంజీగోండుకు దక్కుతుందన్నారు. ఆ మహనీయుడు చూపిన బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సిడాం రాంకిషన్, రోకొండ్ల రమేష్, కుమ్ర రాజు, మెట్టు ప్రహ్లాద్, విజ్జగిరి నారాయణ, రాజన్న, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.



పార్డీ(కే) గ్రామంలో వర్ధంతి సభలో నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

బోథ్: మండలంలోని పార్డీకే గ్రామంలో ఆదివాసీల పోరు బిడ్డ రాంజీ గోండు వర్ధంతి సభను జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాంజీగోండుకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ దేవారి మహాజన్ గ్రామ జెండా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. బ్రిటీష్ వారిని ఎదిరించి పోరాటం చేసి 10వేల మందితో సహా రాంజీ గోండు కూడా అమరుడు కావడం జరిగిందని వారు పేర్కొన్నారు. 167 ఏళ్ల క్రితం అసువులు బాసిన రాంజీ గోండు ఆదర్శనీయుడు అని అన్నారు. ఇందులో గ్రామ పటేల్ అమృతరావు, దేవరి బయతు, నాయకులు మిశ్రం భూమన్న, మదన్, అనిల్, జైతు, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పంచాంగ పఠనం



పచ్చడిని పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



జామిడి గ్రామంలో రైతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

వాడవాడలా ఉగాది వేడుకలు

● ఆయా రాజకీయ పార్టీ కార్యాలయాల్లో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి వితరణ ● పలు మండలాల్లో వ్యవసాయ పనులు షురూ!

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 9: ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం వాడవాడలా ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్‌లో అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధల మధ్య తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పంచాంగానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేద పండితులు ప్రవీణ్‌శర్మ పంచాంగ పఠనం చేశారు. అనంతరం కంది శ్రీనివాస్ రెడ్డి పండితులును సత్కరించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుందతి వెంకట్ రెడ్డి, మాజీ డీసీసీబీ అధ్యక్షులు ముడుపు దామోదర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు మంచికట్ల ఆశ్మ, డి.శ్రీలేఖ, మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్‌రావుపటేల్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సెడ్మకి ఆనంద్‌రావు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శాంతన్‌రావు, ఎన్ఎస్‌యూఐ జిల్లాఉప అధ్యక్షుడు కొండూరి రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు భరత్‌వాఘ్మారే, బాయిన్‌వార్ గంగారెడ్డి, బండి దేవిదాస్‌చారి, సుధాకర్, కళ్లెంభూమారెడ్డి, డొగ్గలి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో..

ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని శ్రీక్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వేద పండితులతో శాస్త్రోక్తంగా ఉగాది పంచాంగ శ్రవణ పూజను ప్రారంభించి కార్యకర్తలకు ఉగాది పచ్చడిని అందజేశారు. ప్రతీఒక్కరు శాంతి సామరస్యంతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని అష్ట ఐశ్వర్యాలతో ప్రతీ ఒక్కరికి సుఖ సంపదలు కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, గోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, మమతరాజన్న, కొమురరాజు, సోనేరావు, ఆశన్న, అసీఫ్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

● శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో..

నూతన సంవత్సరం క్రోధినామ ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక్‌చౌక్‌లో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఉగాది పచ్చడి, గుడాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముందుగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ మాట్లాడుతూ ఆచారాలను, కట్టుబాట్లను పాటిస్తూ మన తెలుగు వారికంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపునిచ్చే పండుగ ఉగాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు ఆరే.భూమన్న, ప్రధాన కార్యదర్శి కోరెడ్డి, లెనిన్, సంయుక్త కార్యదర్శి నెల్లల సమయ్య, సభ్యులు హనుమండ్లు, సాయికోటేశ్వరరావు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

● 'రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు'

తాంసి: రైతుల సంక్షేమం కోసం తనవంతు పూర్తి సహకారం అందిస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని జామిడి గ్రామంలో రైతులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడి పంటలు సమృద్ధిగా పండినప్పుడే రైతుల్లో సంతోషం కలుగుతుందన్నారు. బోథ్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పర్యటించి రైతులకు పెద్దపీట వేస్తానన్నారు. తన నిధుల్లో నుంచి ఎక్కువగా రైతు సంక్షేమం కోసమే వెచ్చిస్తానన్నారు. ప్రతీ రైతు ప్రభుత్వాలు చేపట్టే పథకాల్లో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం రైతులు తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంట కేశవరెడ్డి, వీడీసీ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌రెడ్డి, బద్దం కేశవరెడ్డి, విలాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్ పంట చేనులో పనులను ప్రారంభిస్తున్న రైతన్న

బోథ్: ఉగాది పండుగను పురస్కరించుకుని సోనాల గ్రామంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గత 14 సంవత్సరాలుగా స్థానిక టెంట్ హౌస్ వారు పచ్చడి తయారు చేసి పంపిణీ చేయడం జరుగుతుంది. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కానిదే మురళీతో పాటు పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు. బోథ్ మండల కేంద్రంలో సీఐ రమేష్ ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాగభూషణం పాఠశాల వారు తయారు చేయించిన ఉగాది పచ్చడిని ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పచ్చడి ఆరోగ్యానికి ఎంతో మంచిది అని షడ్రుచులతో కూడిన పచ్చడిని సేవించడం వలన ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు కొన్ని రకాల వ్యాధులు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం పాఠశాల కరస్పాండెంట్ కిషోర్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలం పరిధిలోని అన్ని గ్రామాలలోరి రైతు కుటుంభాలు ఉగాది వేడుకలను గనంగా నిర్వహించుకున్నారు. ఒక రోజు ముందుగా రైతన్నలు వడ్రంగిల దగ్గ వ్యవసాయ పనిముట్లను నూతనంగా తయారు చేయించుకున్నారు. ఉదయం నాలుగు గంటల సమయం నుంచి ఎడ్లబండిలో వ్యవసాయ నూతన పనిముట్లను తీసుకుని చేనులోని ఆరె చెట్టుకు పూజలు నిర్వహించి. నూతన పనిముట్లతో వ్యవసాయ పనులను ప్రాంభించారు. నేటి నుంచి రైతన్నలు వ్యవసాయ పనులను ఖరీఫ్ సీజన్ కోసం పంట చేల్లను సిద్ధం చేస్తారు.

జైనథ్: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రమైన జైనథ్ క్రోదినామ సంవత్సరమైన ఉగాది పండుగ వేడకలను రైతులు ప్రజలు మహిళలు భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వేకువ జామునే తమ పంట పొలాల్లో వివిధ దేవత మూర్తులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే ఖరీఫ్ వానకాలంకు సంబంధించి వ్యవసాయ పనులకు స్వీకరం చుట్టారు. అంతరం స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రధాన అర్చకులైన దుప్పారి దీరజ్‌కుమార్, క్రోదినామ సంవ త్సరం యొక్క పంచాంగ శ్రావణాన్ని చదివి వినిపించారు.



సోనాలలో ఉగాది పచ్చడి సేవిస్తున్న రైతులు



బోథ్ బస్టాండ్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న సీఐ

నిర్మల్ జిల్లాలో ఘనంగా ఉగాది వేడుకలు

నిర్మల్ జిల్లాలో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లన్నీ పచ్చని తోరణాలతో అలంకరించారు. వాకిళ్లన్నీ అలికి రంగవల్లులతో తీర్చి దిద్దారు. నూతన వస్త్రాలు ధరించి పూజలు చేసి, ఆలయాలను దర్శించుకన్నారు. ఉగాది పచ్చడిని సేవించి అందరికీ పంచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు.

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 : నిర్మల్ జిల్లా కేంద్రంలో క్రోధి నామ ఉగాది పర్వదిన వేడుకలను ప్రజలు మంగళవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. దేవరకోట, హరిహరక్షేత్రం, సాయిబాబా, శ్రీరామాలయంలో భక్తులు పాల్గొన్నా రు. ఉగాది పచ్చడి సేవించి, పంచాంగ పఠనంలో పాల్గొన్నారు. మున్నూరు కాపు మిత్ర మండలి నిర్వహించిన ఉగాది వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొన్నారు. ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అయ్యన్న గారి భూమయ్య, ఎర్రవోతు రాజేందర్, ఉప్పాల రమేష్, శంకర్, తదితర సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన నాయకులు

ఉగాది పర్వదినం పురస్కరించుకొని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆయన నివాసంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, పాకాల రాంచందర్, తదితరులు ఇంద్రకరణ్‌రెడ్డికి పూల మొక్క అందించారు. అల్లోల మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు. అమరవేణి నర్సాగౌడ్, భాస్కర్, లక్ష్మీనారాయణ, దశరథ్, పద్మనాభం శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

దిలావర్‌పూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో క్రోధినామ సంవత్సర ఉగాది పండగను భక్తి. శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మామిడాకుల తోరణాలతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. రైతులు తెల్లవారు జామున స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి అరకలతో పంట చేన్లకు బయలుదేరారు. భూమాతకు ప్రత్యేకపూజలు చేశారు. అంబలితో అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. ఆ తర్వాత అరకలతో ఐదు చుట్లు దుక్కి చేశారు. ఉగాదితో ఖరీఫ్‌కు శ్రీకారం చుట్టారు. ఉగాది పచ్చడిని ఆరగించారు. కదిలి, కాల్వ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కదిలి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు పంచాక్షరీ పంతులు పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు దేవస్థానం చైర్మన్ వెంకట్ రావు పటేల్, మాడేగాం మారుతి పటేల్, దత్తు పటేల్, మాజీ చైర్మన్ సంభాజీ రావు పటేల్, తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని పంచముఖ హనుమాన్ ఆలయం వద్ద క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని ప్రముఖ వేదపండితులు సంజయ్‌శర్మ, నరేష్‌శర్మలు పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరేష్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : మండలంలో ఉగాది పండగ వేడుకలను మంగళవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదం రూపంలో అందజేశారు. పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. కుడుకల పేర్లను వేసుకొని చిన్నారులు సందడి చేశారు.

భైంసా : ఇక్కడి ప్రాంతంలో ఉగాది పర్వదినాన్ని రైతులు మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయం, సాయిబాబా మందిరం, నర్సింహస్వామి మందిరాలు కిటకిటలాడాయి. పట్టణ బస్టాండ్ ఎదుట సత్యసాయి సేవా సమితి, శివాజీ చౌక్‌లో హిందూవాహిని, ప్రధానకూడలీల్లో పలు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఉగాది పచ్చడి పంపిణీని చేపట్టారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ బీజేపీ శ్రేణులతో కలిసి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఉగాది పచ్చడి పంపిణీ చేపట్టారు.

నర్సాపూర్(జి) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో పండితులు పంచాంగ పఠ నం చేశారు.ఉగాది పచ్చడిని ప్రజలు ఒక్కరికొక్కరు పంచుకుని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని పోచమ్మ, ముత్యాలమ్మ, నాయకమ్మ దేవతామూర్తులకు భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు బోనాలు సమర్పించారు. మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయం వద్ద మంగళవారం శ్రీకోధినామ ఉగాది సంవత్సర వేడుకలను ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం ప్రజలు ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రోధి నామ సంవత్సరంలో రైతన్నలు కోటి ఆశలతో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.



భూమి పూజ అనంతరం భోజనం చేస్తున్న రైతులు



ఖరీఫ్‌కు శ్రీకారం



భైంసాలో ఉగాది పచ్చడి పంపిణీ

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.9; కనిష్ఠం 25.5



ఆశలు.. ఆవిరి!



నీరు లేక బోసిపోయిన సరస్వతి కాలువ

- జిల్లాలోని ప్రాజెక్టుల్లో కనిష్టస్థాయికి నీటిమట్టాలు
- రబీ పంటలకు కష్టకాలం
- సాగునీరు అందక అన్నదాతల గగ్గోలు
- సరస్వతీ కాలువదీ దీనస్థితి
- కడెం, స్వర్ణ ఆయకట్టు రైతుల బెంబేలు

నిర్మల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. ఓ వైపు మండుతున్న ఎండలు మరోవైపు మండుతున్న ఎండలతో నీరు ఆవిరి అయిపోతుండడం అలాగే ఖరీఫ్ చివరలో ప్రాజెక్టుల నుంచి నీరును అవసరానికి మించి గరిష్టంగా వాడుకోవడంతో ఇప్పుడు ఈ ప్రాజెక్టుల్లోని నీటిమట్టం కనిష్టస్థాయికి చేరుకుంది. ఇప్పటికే రిజర్వాయర్‌లో నీటిమట్టం పూర్తిగా పడిపోయిన కారణంగా కడెం ప్రాజెక్టు కింద యాసంగికి క్రాఫ్ హాలీడే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే దాదాపు 68వేల ఎకరాల్లో క్రాఫ్ హాలిడే కొనసాగుతోంది. ఇదిలా ఉండగా 13వేల ఎకరాలకు సాగునీరు అందించే సదర్మాట్ పరిస్థితి కూడా ప్రస్తుతం దయనీయంగా మారింది. ఎస్సారెస్పీ నుంచి సరస్వతీ కాలువ ద్వారా నీరు అందకపోతుండడంతో సదర్‌మాట్ ఆయకట్టు రైతాంగం ఆందోళనకు గురవుతోంది. ప్రస్తుతం సదర్‌మాట్ కాలువల కింద 10వేల ఎకరాల పంటలు సాగవుతున్నట్లు చెబుతున్నారు. సాగునీరు అందకపోతుండడంతో ఈ పంటలన్ని ఎండిపోయి నష్టాలపాలయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దీంతో పాటు గడ్డెన్నవాగు, స్వర్ణ ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల కింద రబీపంటల సాగుకు తిప్పలు తప్పడం లేదని చెబుతున్నారు. స్వర్ణప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 1183 అడుగులు కాగా ప్రస్తుతం 1171.6 అడుగులుగా ఉంది. అయితే ఈ నెలాఖరు వరకు ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో నీరందడం కష్టమేనంటున్నారు. గడ్డెన్న వాగు ప్రాజెక్టులో కూడా పరిస్థితి ఇదే తరహా ఉందంటున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు కింద సాగవుతున్న పంటలకు అరకొర నీరే అందు తుందని చివరి వరకు సాగునీరు అందించే పరిస్థితులు కష్టతరం కానున్నాయంటున్నారు. మొత్తానికి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నీటిమట్టాలు వేగంగా పడిపోతుండడం, యాసంగి పంటలకు కాలువల ద్వారా నీరు ఎక్కువగా అవసరమవుతున్న కారణంగా పంటల పరిస్థితి గందరగోళంగా మారబోతుందని అంటున్నారు. ఎస్సారెస్పీ ద్వారా సరస్వతీ కాలువ ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందకపోతుండడంతో ఈ కాలువ ఆయకట్టు రైతులు ఇప్పటికే ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. సమస్యను గుర్తించిన మహేశ్వర్ రెడ్డి హుటాహుటిన ప్రభుత్వంతో మాట్లాడి సరస్వతీ కాలువకు నీటి విడుదలపై హామీ పొందారంటున్నారు. ఈ హామీ మేరకు ఒకటి రెండు రోజుల్లో సరస్వతీ కాలువకు ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదలయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

ఇప్పటికే కడెం కింద క్రాఫ్ హాలీడే..

ఇదిలా ఉండగా మొన్నటి వరదల కారణంగా కడెం ప్రాజెక్టు గేట్లు దెబ్బతినడంతో ఆ ప్రాజెక్టు రిజర్వాయర్‌లోని నీరంతా వృధాగా గోదావరి పాలయ్యింది. మొదటి నుంచి ప్రాజెక్టు నీరు లీకేజీల కారణంగా దిగువకు వెళ్ళిపోవడంతో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ఎలాగోలాగా ఖరీఫ్ పంటలు సాగైనప్పటికీ రబీసీజన్ నాటికే ప్రాజెక్టులో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అప్రమత్తమైన అధికారులు మిషన్ భగీరథ కోసం ప్రాజెక్టులోని నీటిని అందులో ఉంచి రబీ పంటలకు నీరివ్వలేమంటూ ప్రకటించారు. ఈ సారి యాసంగిలో కడెం ప్రాజెక్టు కింద క్రాఫ్ హాలీడే ప్రకటిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న నీటితో కేవలం మిషన్ భగీరథ తాగునీటిని మాత్రమే అందించే అవకాశాలున్నాయంటున్నారు. అయితే సదర్‌మాట్ బ్యారేజీ కింద సాగయ్యే పంటలకు ఎస్సారెస్పీ నుంచి నీరు నిలిచిపోవడంతో ఆ పంటల పరిస్థితి అయోమయంగా మారిందంటున్నారు. ప్రస్తుతం సదర్‌మాట్ రైతులు సాగునీటి కోసం ఆందోళనకు దిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. ఇక్కడి రైతుల ఒత్తిడి మేరకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, కాంగ్రెస్ పార్టీ లోకసభ అభ్యర్థి ఆత్రం సుగుణక్కతో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులంతా సోమవారం రాత్రి ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్దకు వెళ్ళి రిజర్వాయర్‌లోని నీటిమట్టాలను పరిశీలించారు. అలాగే ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీటిని విడుదల చేయాలంటూ కోరారు. అధికారులు నీటి విడుదలకు హామీనిచ్చినట్లు వారు చెబుతున్నారు.

స్వర్ణ, గడ్డెన్న వాగులదీ దయనీయ స్థితి..

కాగా స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టుల కింద పంటలు సాగు చేసే రైతులు కూడా ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉందని ఈ నెలాఖరు వరకు పంటలకు సాగునీరు అవసరం ఏర్పడుతుందని వారు చెబుతున్నారు. రిజర్వాయర్‌లో నీటిమట్టాలు తగ్గిపోతున్న కారణంగా పంటలకు సాగునీరు అందించే విషయంపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలని కోరుతున్నారు. స్వర్ణప్రాజెక్టు కింద దాదాపు 10వేల ఎకరాలు సాగులక్ష్యం కాగా ఈ సారి 8వేల ఎకరాల వరకు పంటలను సాగు చేస్తున్నారంటున్నారు.

సరస్వతీ కాలువపై ఆందోళన

కాగా సరస్వతీ కాలువకు ప్రభుత్వం ద్వారా విడుదలయ్యే నీటి కోటా విషయంలో అధికారులు వివక్ష ప్రదర్శిస్తున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం సరస్వతీ ఆయకట్టుకు యాసంగి సీజన్ కోసం గానూ 6టీయంసీల నీరును ఎస్సారెస్పీ నుంచి విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే అధికారులు ఈ కోటాను పక్కన పెట్టి కేవలం 4.5టీయంసీలను మాత్రమే ఇచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారంటున్నారు. ప్రాజెక్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా 8 టీయంసీల నీటిని వరదల కాలువ ద్వారా కరీంనగర్ జిల్లాలోని లోయర్, మిడ్‌మానేరు ప్రాజెక్టులకు విడుదల చేశారంటూ జిల్లా రైతులు మండిపడుతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సీరియస్‌గా స్పందించి ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకువెళ్ళారు. జిల్లాకు కేటాయించిననీటి విషయంలో జరుగుతున్న వివక్షతను ఆయన అధికారులకు వివరించారు. దీంతో ప్రభుత్వం కేటాయించినకోటా మేరకు మిగతా 1.5టీయంసీల నీటిని విడుదల చేసేందుకు అంగీకరించినట్లు ఎమ్మెల్యే చెబుతున్నారు. దీనిపై సరస్వతీ ఆయకట్టు రైతులు సంబురపడుతున్నప్పటికీ అధికారుల తీరుపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయంటున్నారు.

జిల్లాలో 30 పోలీసుయాక్ట్ అమలు : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 : జిల్లాలో 30 పోలీసుయాక్ట్ ఈ నెల 1 నుండి 30 వరకు అమలులో ఉంటుందని ఎస్పీ జానకిషర్మిల తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ చట్టం ప్రకారం డీఎస్పీ, ఇతర ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు, ఊరేగింపు, ధర్నాలు జరుపరాదని సూచించారు. నిషేధిత ఆయుధాలు, ప్రేలుడు పదార్థాలు, నేరానికి ఉసిగొలిపే ఎలాంటి ఆయుధాలను వాడరాదన్నారు. జనం గుమి గూడటం, రాళ్ల జమ చేయడం ధరించి మీటింగ్‌లకు వెళ్లడం నిషేధమన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు కూడా నిషేధమేనన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే శిక్షార్హులని తెలిపారు.

ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

పెంబి, ఏప్రిల్ 9 : పెంబి మండల కేంద్రంలోని హరిహర ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 11 నుండి 13 వరకు నిర్వహిస్తున్న వార్షికోత్సవానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పటేల్‌కు మంగళవారం పెంబి కాంగ్రెస్ నాయకులు ఖానాపూర్‌లో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. వార్షికోత్సవానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సినల్ చైర్మన్ రాజుర సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సల్ల స్వప్నిల్‌రెడ్డి, తులాల శంకర్, మతిన్, దయానంద్, రమేష్‌చారి, తదితరులు ఉన్నారు.

శ్రీగిరి క్షేత్రంలో అభిషేకం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 : ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీగిరి క్షేత్రంలోని శ్రీవల్లి దేవసుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకం నిర్వహించారు. అన్నదాన వితరణను అప్పాల లత ప్రభాకర్ చేశారు. శనిగారపు చిన్నయ్య, జనార్ధన్, దేవేందర్, అప్పాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ విభాగంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి


షబ్బీర్‌పాషాను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నాయకులు

ఖానాపూర్, ఏప్రిల్ 9 : ఖానాపూర్ నియోజకవర్గంలో మైనారిటీ విభాగంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ మైనారిటీ ఎన్నికల అబ్జర్వర్ షబ్బీర్‌పాషా అన్నారు. మంగళవారం స్థాని జేకే ఫంక్షన్‌హాల్‌లో ఖానాపూర్ మండల మైనారిటీ నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త శ్రమించాలన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ మైనార్టీ ఎన్నికల అబ్జర్వర్‌గా నియమితులైన షబ్బీర్‌పాషాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యూసఫ్‌ఖాన్, సలీంఖాన్, షౌకత్‌పాషా, ఆసిఫ్‌అలీ, మున్ను, మీర్జాబేగ్, ముషీర్, అన్ను, రాహుల్, ఇస్రాత్ తదితరులున్నారు.

సౌదీ అరేబియా రోడ్డు ప్రమాదంలో భైంసా వాసి మృతి


మెహరాజ్ ఖాన్ (ఫైల్)

భైంసా, ఏప్రిల్ 9 : ఉపాధి కోసం సౌదీ అరేబియా దేశానికి వెళ్లిన భైంసా వాసి ఒకరు అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం భైంసాలోని నయాబాది మహమ్మదీయనగర్‌కు చెందిన మేహరాజ్‌ఖాన్ (38) మూడు నెలల క్రితం సౌదీ అరేబియా దేశంలోని మక్కా నగరానికి వెళ్లాడు. అక్కడి ఒక ఇండస్ట్రీస్‌లో వెల్డింగ్ పనులు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు, మసీద్‌లో ప్రార్ధనలు పూర్తి చేసుకొని తానుంటున్న గది వైపు నడుచుకుంటూ వెళ్లాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మెహరాజ్ మృత్యువాతపడ్డాడు. మృతునికి పది సంవత్సరాలలోపు ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.

రాంజీ గోండుకు ఘన నివాళులు


రాంజీ గోండు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తుడుందెబ్బ నాయకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 : ఆదివాసీ అమరవీరుడు రాంజీ గోండు 167వ వర్ధంతి సందర్భంగా మంగళవారం నిర్మల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి తుడుందెబ్బ నాయకులు ఘన నివాళులర్పించారు. రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ గోడెం గణేష్, ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య మాట్లాడుతూ.. ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠ్యాంశంలో రాంజీ గోండు చరిత్ర చేర్చాలని, నిర్మల్ కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు.

నివాళులర్పించిన ఎస్ఎఫ్ఐ


నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 : రాంజీ గోండు వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి భారత విద్యార్థి పరిషత్ నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ... జల్ జంగల్ జమీన్ హమారా నినాదంతో ఆదివాసి స్వయం పాలన కోసం బ్రిటిష్ వారితో వీరోచిత పోరాటం చేసి అసువులు బాసారన్నారు. విద్యార్థి లోకం ఆయనను స్మరించుకోవాలన్నారు. సంతోష్, సాయి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కుస్తీ పోటీలు

కుభీర్, ఏప్రిల్ 9 : మండల కేంద్రం కుభీర్‌లో మంగళవారం ఉగాది పండుగను పురష్కంచుకొని కుస్తీ పోటీలను నిర్వహించారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా విఠలేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతిగా రూ.5000, రెండవ బహుమతిగా రూ. 3000లను విజేతలకు అందజేశారు. ఉగాది పండుగను పురష్కరించుకొని ప్రజలు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. రైతులు నూతన పనులకు శ్రీకారం చుట్టారు. వివిధ ఆలయాల్లో అయ్యవార్లు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

- ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పాటిల్


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్



కుంటాల బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

భైంసా, ఏప్రిల్ 9 : వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు గాను చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పెర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో 10 వ వార్డు కౌన్సిలర్ రావుల సువర్ణ పోశెట్టిలు ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమాజసేవ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. 10 వ వార్డు కౌన్సిలర్ రావుల సువర్ణ,పోశెట్టిలు గత కొన్ని సంవత్సరాలుగా వేసవిలో చలి వేంద్రాల ఏర్పాటుతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.కరోనా కష్టకాలంలో కౌన్సిలర్ దంపతులు అనిర్వచనీయమైన సేవలు అందించారని అభినందించారు. ఇందులో బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్‌మున్సిపల్ కౌన్సిలర్ గౌతం పింగ్లే, బీజేపీ ప్రతినిధులు ఎనుగు గంగారెడ్డి, బాజనొల్ల గంగాధర్, తూమోల్ల దత్తు, సాంప్లీ రమేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కుంటాల : మండల కేంద్రం కుంటాల బస్టాండ్ ఆవరణలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది మండల కేంద్రం కుంటాలకు చెందిన జుట్టు పరివారము ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో వేసవికాలంలో వచ్చిపోయే భక్తుల సౌకర్యార్థం చల్లని నీరు అందజేయడం గత కొద్ది రోజుల నుండి చలివేంద్రం ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం చలివేంద్రాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్,ఎస్ఐ రజనీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, మాజీ పీఏసీఎస్ చైర్మన్ జుట్టు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ జుట్టు మహేందర్, స్థానికులు భుజంగం గణపతి, ప్యాదరి భూమన్న, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ కీలక పాత్ర

- జిల్లా అధ్యక్షులు యాటకారి సాయన్న
- ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం



పీఆర్టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం


కేక్ కట్ చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 9 : ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించడంలో పీఆర్టీయూ ఎల్లవేళలా ముందుంటుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు యాటకారి సాయన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో సంఘం ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ తెలంగాణ జెండా ఎగురవేసి, కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా శాఖ అధ్యక్షులు యాటకారి సాయన్న మాట్లాడుతూ.. సంఘం ఉన్నతిని తెలుపుతూ ఆవిర్భవించి దినదిన అభివృద్ధి చెందుతూ ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతూ, హక్కుల పరిరక్షణ, విధుల నిర్వహణ, సామాజిక న్యాయం అన్ని సిద్ధాంతాలతోటి ముందుకెళ్తుందన్నారు. అనేక పోరాటాలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం చేసి ఈ సంఘ నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యారన్నారు. ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఉమాకర్‌రెడ్డి, పర్వత సత్యనారాయణ పర్యవేక్షణలో టెట్‌తో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చే విధంగా ఢిల్లీకి వెళ్లి ఎన్సీటీఈ అధికారులను కలిసి ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చే విధంగా కృషి చేస్తామని అదే విధంగా జిల్లాలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్పాట్ వ్యాలివేషన్‌లో ఉన్న భాషా పండితులకు, పీఈటీలకు, ఎస్‌జీటీలకు, స్పెషల్ అసిస్టెంట్లకు రెమ్యునరేషన్ పెంచాలని, సెలవు దినాల్లో స్పెషల్ క్యాజువల్ లీవ్స్, టీఏ, డీఏ కల్పించే విధంగా రాష్ట్ర నాయకత్వం ప్రాతినిధ్యం చేసిందని తెలిపారు. దాని కొరకు జిల్లా శాఖ కూడా డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నిర్మల్ జిల్లా అధ్యక్షులు వెల్మల ప్రభాకర్, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రవి, పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ఉపాధ్యక్షులు బి. శంకర్, నాయకులు ఏ. శ్రీకాంత్, శ్రీరాముల శ్రీనివాస్, వై. శ్రీకాంత్, పులిండ్ల సురేష్, వై. శ్రీధర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మోర్చ అసెంబ్లీ ఇన్‌చార్జీగా గులాబ్‌నాయక్

కుభీర్, ఏపిల్ 9 : ముధోల్ నియోజక వర్గ భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చ అసెంబ్లీ కన్వీనర్‌గా మండలంలోని రంజిని గ్రామానికి చెందిన గులాబ్ నాయక్‌ను ఎంపిక చేసినట్లు బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం గులాబ్ నాయక్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ తనపై నమ్మకంతో ఈ పదవి అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షునికి, ఎమ్మెల్యే రాంరావు పాటిల్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్నం నాగేశ్, ఏశాల దత్త్రాత్రి, గంగాధర్, నర్సప్ప, సాయినాథ్, నిరంజన్, కనకయ్యలున్నారు.

సంక్షిప్త సమాచారం

బాధితుడిని పరామర్శించిన ఐకే రెడ్డి


బాధితుడితో మాట్లాడుతున్న ఐకే రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 9 : ఇటీవల విద్యుదాఘాతంతో గాయాలపాలైన లక్ష్మణచాంద మండలం పీచర గ్రామానికి చెందిన బాధితుడు బి. గోపిని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో బాధితుడు చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని మనోధైర్యం కల్పించారు. నాయకులు ఆయన వెంట ఉన్నారు.

గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో షెడ్డు నిర్మాణం


గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో షెడ్డును ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుంటాల, ఏప్రిల్, 9 : మండల కేంద్రం కుంటాల ప్రజల ఇలవెల్పు గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి గజ్జారాం తన కుమారుడు కీర్తి శేషులు జక్కుల వేణు స్మారకార్థం రూ. 5 లక్షల వ్యయంతో భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మించారు. నిర్మాణం పూర్తయిన షెడ్డును మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అప్పజెప్పారు. కుమారుడి స్మారకార్థం రూ.5 లక్షల ఖర్చుతో షెడ్డును నిర్మించడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

మద్యం పట్టివేత

సారంగాపూర్, ఏప్రిల్ 9: మండలంలోని జాం గ్రామానికి చెందిన పోశెట్టి ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను మంగళవారం స్వాధీనం చేసుకొని పోశెట్టి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సుమారు వాటి విలువ రూ.9 వేలు ఉంటుందని పేర్కొ న్నారు.

రెడ్డి సంఘం కార్యవర్గం ఏర్పాటు

సారంగాపూర్, ఏప్రిల్ 9 : మండల కేంద్రంలో రెడ్డి సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సంఘం అధ్యక్షులుగా పి. లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులుగా గట్టుమీది రాజారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా చిన్నారెడ్డి, లింగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులను ఏగ్రీవంగా ఎన్నుకున్నారు.